కథ

# అర్జెంట్

డా॥ మల్లెమాల వేణుగోపాలరెడ్డి

**"సార్! వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ బ్లాక్ అయింది. మీరు అర్జెంటుగా బయలుదేరండి. బండి రెండో నెంబర్ ప్లాట్‌ఫారం మీదకొస్తుంది. మనం బ్రిడ్జి ఎక్కి దిగాలి. లగేజి కూడా ఎక్కువుందన్నారు గదా! ఓబులేసును కూడా తీసుకరండి" సెల్‌ఫోన్లో జిలానీ చెప్పాడు. జిలానీ రైల్వేస్టేషన్లో ఫుడ్ కాంట్రాక్టర్. నేను అతనికి ఫ్యామిలీ డాక్టరు. ఓబులేసు మా వాచ్‌మేన్.**

"మనం అర్జెంటుగా కదలాలి... ఆలస్యమైతే ట్రెన్ మిస్ అవుతాం" మా ఆవిడ వరలక్ష్మికి చెప్పి లగేజి కారులో పెట్టించాను.

"మీదంతా అర్జెంటే... టిక్కెట్లు తీసుకున్నారా, సూట్‌కేసెస్ కీస్ తీసుకున్నారా! ఓబులేసూ వాటర్ బాటిల్‌కి నీళ్లు పట్టు... అర్జెంట్" కేక వేసింది మా ఆవిడ.

కారెక్కాము. డ్రైవర్ శంకర్ కారు స్టార్ట్ చేసాడు.

"సార్! సార్! అర్జెంటు కేసు... మా వాడికి స్కూటర్ ఆక్సిడెంటయ్యింది. తలకు గాయమైంది. రక్తం కారుతూంది" ఆటోలో వచ్చిన వీరాస్వామి... మా ఓల్డ్ పేషెంటు.

"మేము హైదరాబాదు వెళ్తున్నాం. రైలుకు టైం అయింది. నేను రిమ్స్ హాస్పిటల్‌కు ఫోన్ చేస్తాను. వెళ్లండి" చెప్పాను. కారు కదిలింది. సెల్‌ఫోనులో రిమ్స్ క్యాజువాలిటీకి ఫోన్ చేసాను. "డా॥ గిరిధర్ వున్నారా?" అడిగాను. గిరిధర్ రిమ్స్‌లో సర్జన్, నా ఫ్రెండ్.

"డాక్టరుగారు ఆపరేషన్ థియేటర్‌లో వున్నారు సార్! అర్జెంటు కేసు. ఏమైనా మెసేజిస్తే... చేరుస్తాము" వీరాస్వామి కేసు చెప్పాను.

కారు దిగి పరుగు పరుగున ప్లాట్‌ఫారం చేరాము. మా వాళ్లు లగేజి తోసుకొచ్చారు. రైలు సిగ్నలయింది.

"మీ కోసం యిప్పటిదాకా స్టేషన్ మాస్టర్‌గారు కూడా వెయిట్ చేసారు సార్! ఇప్పుడే టౌన్‌లో అర్జెంటు పని వుందని వెళ్లారు. మీతో చెప్పమన్నారు" జిలానీ చెప్పాడు. స్టేషన్ మాస్టర్ విలియమ్స్ నాకు మంచి ఫ్రెండ్.

రైలెక్కాం. బెర్తులు పరుచుకొని పడుకున్నాం. రైలు తాడిపత్రి సమీపిస్తున్నదనుకుంటాను టీ.సీ. వచ్చి నన్ను తట్టి లేపాడు. "సారీ సార్! మీరు డాక్టరు గదా! త్రీ ఏ.సీ.లో ఒక ప్యాసింజర్ కడుపునొప్పితో మెలికలు తిరిగి పోతున్నాడు. మీరు అర్జెంటుగా వచ్చి చూడాలి... ప్లీజ్ ఒబ్లైజ్ సార్".

వెళ్లి చూసాను. తాగి వున్నాడు. ఫుల్‌గా చికెన్ పలావు తిన్నాడు. వాంతి జేసుకున్నాడు. కొన్ని మందులిచ్చి వచ్చాను. ప్రయాణాలలో ఎమర్జెన్సీ మెడిసన్స్ తీసుకపోవడం నా అలవాటు. చాలాసేపు నిద్ర పట్టలేదు.

తెల్లవారింది. రైలు రెండు గంటలు ఆలస్యంగా నడుస్తూంది.

సురేష్ వరలక్ష్మికి ఫోన్ చేసాడు. "అక్కా! ట్రెన్ లేటు. మీరు ఆలస్యం చెయ్యకుండా దిగి వచ్చేయండి. మనం ఫంక్షన్ హాలుకి తొమ్మిదికే చేరుకోవాలి. పదికి ఫంక్షన్. కారు తీసుకుని శీను స్టేషన్లో వెయిట్ చేస్తున్నాడు. షార్ట్ కట్‌లో కారు డ్రైవ్ చెయ్యమన్నాను". సురేష్ వరలక్ష్మి తమ్ముడు. హైదరాబాదులో సూపరెండెంట్ ఇంజనీర్. ఆయన కొడుకు పెళ్లి నిశ్చితార్థానికి మేం వెళుతున్నాం.

కాచిగూడలో రైలాగింది. లగేజి తోసుకుని వరలక్ష్మి బోగీ గేటు ముందుకొచ్చింది.

"ప్లీజ్ మేడమ్! నాక్కొంచెం అర్జెంట్. ఇంటర్వ్యూ తొమ్మిదింటికి. నన్ను ముందు దిగనివ్వండి".


పోర్టర్స్ తోసుకుని రైలెక్కారు. శీను వచ్చి లగేజి అందుకున్నాడు. పరుగు పరుగున కారెక్కాం.

"పార్కింగ్ టాక్స్... పది రూపాయలు" కారు ప్రక్కనే నిలబడి అడుగుతున్నాడు.

"పోవయ్యా! అర్జెంటుగా వెళ్లాలి. లోపల డాక్టర్లున్నారు" కారు స్టార్ట్ చేసాడు శీను. అతడు కారు డిక్కీ మీద కొట్టాడు. నెంబరు నోట్ చేసుకున్నట్టున్నాడు.

సంజీవరెడ్డి నగర్‌కు షార్ట్‌కట్‌లో తీసుకెళ్లాడు శీను. సురేష్ యిల్లంతా హడావుడిగా వుంది.

"అన్నా! మీరు త్వరగా రెడీ కండి!



మేము అర్జెంటుగా వెళ్లిపోతున్నాం" చెప్పింది నిర్మల... సురేష్ వైఫ్.

"అక్కా! అమ్మను, లక్ష్మమ్మనూ వేరే కార్లో పంపించేశా... ఆమె వాకర్‌తో నడవాలి కదా! మేము వెళుతున్నాం. మీరూ వచ్చేయండి... శీనూ! అర్జెంటుగా హోటల్‌కెళ్లి అక్కావాళ్లకు టిఫిన్ తెచ్చిపెట్టు" చెప్పి అంతా వెళ్లిపోయారు.

"నాలుగు చెంబులు పోసుకుని రెడీగా. నేను రైల్లోనే బ్రషింగ్, టాయిలెట్... షేవింగ్ చేసేసుకున్నాను. ట్రైన్ షేక్‌లో గడ్డం కొంచెం తెగింది. బాండ్ ఎయిడ్ వేసాను" చూపించి వరలక్ష్మితో అన్నాను.

"చాలా అసహ్యంగా వుందండీ..." చెప్పి బాండ్ ఎయిడ్ పీకేసిందామె.

శీనూ టిఫిన్ తెచ్చాడు... నోట్లో కుక్కుకున్నాము... వరలక్ష్మి స్నానానికెళ్లింది.

"సార్! మీరు అర్జెంటుగా రావాలట. పెండ్లికూతురు తాలూకు వాళ్లంతా వచ్చారట. నిర్మల మేడమ్ ఫోన్ చేసింది" శీను తొందరపెట్టాడు.

నేను స్నానం చెయ్యలేదు. ముఖం కడుక్కుని డ్రెస్ చేసుకున్నాను.

ల్యాండ్‌ఫోన్ మోగింది. వరలక్ష్మి ఎత్తుకుంది. స్పీకర్ ఫోన్ ఆన్‌జేసింది.

"ఎవరండీ మాట్లాడేది" అటునుంచి.

"నేను... నిర్మల ఆడబిడ్డను. ఏం కావాలి చెప్పండి".

"మాకు ఫంక్షన్ హాల్‌కి డైరెక్షన్స్ కావాలండీ".

"ఏమండీ! మీరు మాట్లాడండి" ఫోన్ నా చేతికిచ్చి మేకప్ చేసుకోబోయింది వరలక్ష్మి.

ఫంక్షన్ హాల్‌కు డైరెక్షన్స్ చెప్పాను. ఆ ప్రక్క అంతా కన్ఫ్యూజన్. ఎలాగో చెప్పగలిగాను.

***

ఫంక్షన్ హాల్ సిక్కు విలేజిలో... చేరుకున్నాం. గెస్టులు తీరిగ్గా వస్తున్నారు.

పురోహితుడు "అయ్యా! పెండ్లి పెద్దలు రావాలి. అమ్మాయికి కానుకలు అందజేయాలి. అమ్మాయిని తీసుకరండి... ముహూర్తం పాటించాలి" మైకులో చెపుతున్నాడు.


"బాబూ శ్రీధర్! మీ నాన్న గెస్టులను రిసీవ్ చేసుకుంటున్నారు. వెళ్లి అర్జెంటుగా రమ్మను" కొడుకుని పురమాయించింది వధువు తల్లి.

ఫంక్షన్ స్టార్ట్ అయింది. వధువుకు డైమండ్ సెట్, కాస్ట్లీ చీర బొట్టు పెట్టి యిచ్చింది.

నిర్మల "చూడు పాపా! వెళ్లి చీర మార్చుకురా! అర్జెంటుగా రావాలి... మళ్లీ లంచ్ వుంది... ఆలస్యమైతే గెస్టులంతా వెళ్లిపోతారు". కాబోయే అత్త కోడలికి చెప్పింది.

"అన్నిటికీ అర్జెంటంటే ఎలా చెప్పండి. ఎంగేజ్‌మెంటు ఫంక్షన్ గదా!" వధువు వైపు నుండి ఎవరో...

"సారీ... ఐ మీన్ ఆలస్యం చెయ్యవద్దని..." సర్దుకొని అంది నిర్మల.



నిర్మల "చూడు పాపా! వెళ్లి చీర మార్చుకురా! అర్జెంటుగా రావాలి... మళ్లీ లంచ్ వుంది... ఆలస్యమైతే గెస్టులంతా వెళ్లిపోతారు". కాబోయే అత్త కోడలికి చెప్పింది.
"అన్నిటికీ అర్జెంటంటే ఎలా చెప్పండి. ఎంగేజ్‌మెంటు ఫంక్షన్ గదా!" వధువు వైపు నుండి ఎవరో...

ఈవెంట్ మేనేజర్ని పరిచయం చేసాడు సురేష్. పేరు రంజిత్.

"సారీ సార్! అర్జెంటుగా లంచ్ తీసుకురావడానికి వ్యాన్ పంపాలి. మళ్లీ కలుస్తాను" చెప్పి వెళ్లాడతను.

"సురేష్! ఈ లక్ష్మమ్మ ఎక్కడ చచ్చిందిరా! నేను అర్జెంటుగా టాయ్‌లెట్‌కెళ్లాలి" కేకేసింది సురేష్ అమ్మ. మా అత్త. లక్ష్మమ్మ ఆమె కేర్‌టేకర్. వరలక్ష్మి లేచి వెళ్లి ఆమెను టాయ్‌లెట్‌కు తీసుకెళ్లింది. ఆమె వాకర్ మీద. ఆమెకు యూరినరీ ట్రబుల్.

ఫంక్షన్ పూర్తయింది. లంచ్ రెడీ కాలేదు... గెస్ట్‌ల్లో కొంతమంది వెళ్లిపోసాగారు.

"సారీ సురేష్! మేము ఆర్జెంటుగా వెళ్లాలి. లంచ్‌కు ఉండలేము. క్షమించాలి".

"మేమూ వెళ్లాలి. ఆఫీసులో నేను ఒక గంట పర్మిషన్ తీసుకొని వచ్చాను. అర్జెంటుగా వెళ్లాలి" చెప్పి కొంతమంది జారుకున్నారు.

"ఏమైంది! లంచ్ ఆలస్యమౌతున్నదే" వియ్యంకుణ్ణి అడిగాడు సురేష్.

"సారీ! అదో వ్యాన్ వచ్చేసింది... స్టార్ట్ చేద్దాం" సర్ది చెప్పాడాయన.

"రంజిత్! లంచ్ స్టార్ట్ చెయ్యండి" ఈవెంట్ మేనేజర్ని కేకేసాడు.

"ఎక్కడ చచ్చార్రా! ఐస్‌క్రీమ్ ఏమయింది... పోయి అర్జెంటుగా తీసుకరండి" అరిచి చెపుతున్నాడు రంజిత్.

లంచ్ టైంలో వెనక నుండి "అంకుల్" వినిపించింది స్వరం.

వెనక్కి తిరిగి చూసాను... నాగార్జున... నా ఫ్రెండ్ కొడుకు.

"అమెరికా నుండి ఎప్పుడొచ్చావు?" అడిగాను.

"మూడు రోజులైంది అంకుల్. అర్జెంటుగా నా పెండ్లి కుదిరింది. నాకు రెండు వారాలే సెలవు దొరికింది. తిరుమల కొండ పైన... నాలుగు రోజుల్లో... ఆదివారం. మీరూ... ఆంటీ తప్పక రావాలి. ఇన్విటేషన్లు ప్రింటు చేసే టైం లేదు. అందుకే ఈ ఫంక్షనుకొచ్చి స్వయంగా ఆహ్వానిస్తున్నాను. తక్కినవారికి ఫోన్లో".

"ష్యూర్! తప్పక వస్తాము" చెప్పాను.

కార్లు కదులుతున్నాయి. సురేష్ వచ్చి "మామా! మీరు కొంచెం వెయిట్ చెయ్యాలి. అమ్మ అర్జెంటుగా వెళ్లిపోవాలంటే లక్ష్మమ్మనూ, అమ్మను తీసుకుని శీను వెళ్లాడు. కారు తిరిగి వచ్చేస్తుంది. మీరు వెళ్లొచ్చు. మాకు యింకా ఆలస్యమౌతుంది" చెప్పాడు.

"నో ప్రాబ్లమ్" అన్నాను.

"లేదులే చిన్నాన్నా! మా కార్లో మిమ్ముల్ని దించుతాం. మేమూ సంజీవరెడ్డినగర్‌కే గదా" ప్రసూన చెప్పింది.

ప్రసూన మా అన్న కూతురు. ఆమె భర్త సిద్ధార్థ సోషల్ వెల్ఫేర్ డి.డీ.

సిద్ధార్థ వచ్చి అన్నాడు "సారీ ఆంటీ! మాది గవర్నమెంట్ వెహికిల్. ఆఫీసు నుండి నన్ను అర్జెంటుగా రమ్మని ఫోన్ వచ్చింది. ప్రసూనను కూడా మీరే తీసుకెళ్లాలి... బై" కారెక్కేసాడు సిద్ధార్థ.

శీను కారు వచ్చింది. నేనూ, వరలక్ష్మి, ప్రసూన ఎక్కి కూర్చున్నాం.

కారు డోర్ పట్టుకుని "ప్లీజ్! ప్లీజ్! నేను అర్జెంటుగా రైల్వేస్టేషన్‌కు వెళ్లాలి. ఆలస్యమైతే వరంగల్ ట్రైన్ వెళ్లిపోతుంది... లిఫ్ట్ యివ్వండి ప్లీజ్. సారీ! మీకు ట్రబులిస్తున్నాను" వధువు తరపున మనిషి కాబోలు... అడిగాడు. కారెక్కి కూర్చున్నాడు... సికిందరాబాద్ స్టేషన్లో ఆయన్ని దిగబెట్టి, ప్రసూనను దించి, సురేష్ యింటికి చేరాము.

ప్రయాణ బడలికతో నిద్ర పట్టేసింది.

ఆ రాత్రి కుండపోతగా వర్షం.


తెల్లవారి వరలక్ష్మి నన్ను తట్టిలేపింది. టీ.వీలో న్యూస్ వస్తూ వుంది. అకస్మాత్తుగా అల్పపీడనం... వరదలు... జలప్రళయం... నదులు పొంగి పారుతున్నాయి. కృష్ణా, కావేరి, తుంగభద్ర, వాటి ఉపనదులూ ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. నాగార్జున సాగర్, శ్రీశైలం, ప్రకాశం బ్యారేజిపై నీటి మట్టం ప్రమాద స్థాయికి చేరుకుంది. పరీవాహక ప్రాంతాలలోని ప్రజలను ఖాళీ చేయించి, అప్రమత్తం చేస్తున్నారు... ఇంకో మూడు రోజులు వరదలు విస్తరించే అవకాశం. అధికారులు అలర్టయ్యారు.

అన్ని టీ.వీ. ఛానల్స్‌లో అదే న్యూస్. నిరంతర ప్రసారం... టీ.వీ. ఛానల్స్ తాజా వార్తలను సేకరించి అందించేందుకు తమ తమ బృందాలను ఆయా ప్రాంతాలకు పంపించాయి. కమ్యూనికేషన్స్ కోసం లైఫ్ లైన్ ఫోన్ కనెక్షన్లు స్టార్ట్ చేశాయి.

రెండో రోజుకూ అధికమైన వరదలు. విజయవాడ, మహబూబ్‌నగర్, కర్నూలు నగరాలంతా జలమయమయ్యాయి. పట్టణాలు, పల్లెలూ మునిగిపొయ్యాయి. మంత్రాలయం పూర్తిగా జలమయమైంది. వరదలు ఇళ్లను ముంచేసాయి. పై అంతస్తుల మీద జనం తల దాచుకుంటున్నారు. మంత్రాలయం మఠం మునిగిపోయి నీటిలో చిక్కుకుని, నలుగురు మరణించారు. మొత్తం మీద యాభైకి పైగా మరణించారు.

ప్రభుత్వం అర్జెంటుగా సహాయక చర్యలను చేపట్టి, ముమ్మరం చేయాలని అధికారులను ఆదేశించింది.

నాగార్జునసాగర్, శ్రీశైలం, ప్రకాశం గేట్లు ఎత్తేసారు. వాటి కెపాసిటీకి మించి నీటిని నిల్వ చేయలేకపోతున్నారు. ముఖ్యమంత్రి అర్జెంటుగా మంత్రివర్గంతో భేటీ అయ్యారు. కేంద్ర ప్రభుత్వాన్ని ఈ పరిస్థితిని పరిశీలించి తక్షణం, అర్జెంటుగా ఆర్థిక సహాయం అందించాలని కోరారు. అర్జెంటుగా అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసారు. అన్ని రాజకీయ పార్టీలు, తమ తమ వంతుగా సహాయక చర్యల్లో చేయూతనిచ్చేందుకు సిద్ధపడ్డారు. ఆయా పార్టీ కార్యకర్తలకు, అభిమానులకు ఎక్కడికక్కడ సహాయక చర్యలు చేపట్టవలసిందిగా విజ్ఞప్తి చేసారు. వరదల్లో చిక్కుకుపోయినవారికి ఆహార పొట్లాలు, నీళ్ల ప్యాకెట్లు, దుప్పట్లు, ఇతర దుస్తులు, మందులూ తీసుకుని వివిధ బృందాలుగా ఏర్పడి సహాయక చర్యలు అందిస్తున్నారు. మంత్రులను, ప్రజా ప్రతినిధులను అర్జెంటుగా వారి వారి నియోజకవర్గాలకెళ్లి వివరాలు సేకరించి, వరద ప్రాంతాలకు వెళ్లి పర్యవేక్షించవలసినదిగా ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేసారు. మరణించినవారికి లక్ష రూపాయల ఎక్స్‌గ్రేషియో ప్రకటించారు. ఆర్మీ విమానాలు, హెలికాప్టర్లూ రంగంలోకి దిగాయి. మరబోట్లు, చెక్కపడవలూ అసంఖ్యాకంగా వరదలో చిక్కినవారిని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. లక్షలాదిమంది నిరాశ్రయులైనవారిని ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. గత వంద సంవత్సరాలలో యింతటి ప్రళయం రాలేదని అధికారులంటున్నారు.




టీ.వీ. ఛానల్స్ వాళ్లు శ్రమ తీసుకుని వరద ప్రాంతాలలో పర్యటించి బాధితులను ఫోన్లో మాట్లాడించి ప్రసారం చేస్తున్నారు. పత్రికలూ ఘోషిస్తున్నాయి. అందరిలోనూ అలజడి. జల దిగ్బంధంలో కుటుంబాలు.

"సార్! మాకు అన్నం, నీళ్లు అందడం లేదు. పస్తుంటున్నాం. చిన్న పిల్లలకు పాలు దొరకడం లేదు. అర్జెంటుగా మమ్మల్ని ఒడ్డుకు చేర్చండి సార్! మాకు వెంటనే ఆహారం అందే ఏర్పాటు చేయండి. చచ్చిపోతున్నాం" గగ్గోలుగా అరిచి చెపుతున్నారు.

***రెండో రోజుకూ అధికమైన వరదలు. విజయవాడ, మహబూబ్‌నగర్, కర్నూలు నగరాలంతా జలమయమయ్యాయి. పట్టణాలు, పల్లెలూ మునిగిపొయ్యాయి. మంత్రాలయం పూర్తిగా జలమయమైంది. వరదలు ఇళ్లను ముంచేసాయి. పై అంతస్తుల మీద జనం తల దాచుకుంటున్నారు.***

సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్న జిల్లా కలెక్టర్లకు కంటి మీద కునుకు లేదు. ముఖ్యమంత్రి సెక్రెటేరియేట్‌లోనే ఇరవై నాలుగు గంటలు గడుపుతూ క్షణక్షణం వార్తలు సేకరించి ప్రజలకు ధైర్యం నూరిపోస్తున్నారు... అంతా అర్జెంటయిపోయింది. మా బ్రేక్‌ఫాస్ట్, లంచ్, డిన్నర్లంతా టీ.వీ. ముందే... ఫాస్ట్ ఫుడ్స్... అర్జంటే.

***

ఆలోస్తున్నాను. కడప నుండి ప్రయాణమైన మొదలు... ఎన్నో సంఘటనలు... అర్జెంట్... అర్జెంట్... అర్జెంట్... ఆధునిక కాలంలో జీవితం యాంత్రికమైపోయింది. జీవన మార్గంలో పరుగులే పరుగులు. విశ్రాంతి లేదు... విరామం లేదు. అంతా అర్జెంటే. ఎడతెగని ఒత్తిడి. శుభకార్యాలలో కూడా అంతా అర్జంటే...నింపాదిగా జరుపుకునే అవకాశాలు శూన్యం. అన్నీ అత్యవసర పరిస్థితులే...

ఇదో! ప్రకృతి వైపరీత్యాలు, ఈ జల ప్రళయం, వరద బీభత్సంలో ప్రకటించేదే ఎమర్జెన్సీ. నిజమైన అర్జెన్సీ... మానవ సంబంధాల పట్ల అప్రమత్తం చేసే విశేషమే "అర్జెంటు" అనే పదానికి సరియైన నిర్వచం. మిగతా దైనందిన కార్యక్రమాలలోని అర్జెన్సీ అన్నీ అడ్జస్టబుల్స్...

కడప నుండి ఫోన్ చేసాడు ఓబులేసు. కుందూ నది కూడా పొంగింది. బుగ్గవంక డ్యామ్ గేట్లు ఎత్తేసారట. కడప పట్టణం కూడా వరదలకు గురయ్యే ప్రమాదముందని అధికారులు ప్రకటించారట. ప్రజలను అప్రమత్తం చేస్తున్నారట. మా హాస్పిటల్ కూడా ముంపుకు గురి కాగల అవకాశముందనీ, అర్జెంటుగా మేము కడప చేరాలని చెప్పాడు... హైదరాబాదు నుండి కడపకు రైళ్లు, బస్సుల రాకపోకలు ఆగిపోయాయి. గత్యంతరం లేదు.

ఇండియన్ ఎర్‌లైన్సుకు ఫోన్ చేసాను. తిరుపతికి రెండు టిక్కెట్ల కోసం అడిగాను. ఎమర్జెన్సీ కోటా క్రింద చార్జీలు ఎక్కువ చేసారు. అర్జెంటుగా ఎ.టి.ఎంలో డ్రా జేసి టిక్కెటు కొన్నాను. రేణిగుంట విమానాశ్రయానికి కారు పంపమని కడపకు ఫోన్ చేసాను. నాగార్జున పెళ్లికి పోలేకపోయాను. ప్రస్తుత ప్రాధాన్యం... మా పనికే...

అదే మా స్వార్థం... అర్జెంట్.